

# జ్వలితీరాన

స్టిల్ ఫొటోగ్రాఫ్‌లా ఉంది గది. పుస్తకాల మీద, కుర్చీల మీద రేకులు విడిపోయిన నిన్నటి గులాబీల మీద, ఫ్లవర్ వేజ్ మీద సన్నని దుమ్ముపొర. గది నిండా వెగటు కలిగించే వాసన. కోడిగుడ్డు డొల్లల నుంచి, విసిరేసిన టమేటోల నుంచి, నిన్నటి నుండి కడగని టీ కప్పుల నుంచి, రాత్రి పదకొండు గంటల వేళ నేను, సరళా అరకొరగా తిని వదిలేసిన బిరియానీ పొట్లం నుంచి వస్తున్న వాసన.

లేవాలి. లేచి కనీసం తలుపులన్నా తెరవాలి. తెరిచి క్షణంపాటు అట్లా సూర్యకిరణాల్ని చూడాలి. పేపర్‌బోయ్ నిర్లక్ష్యంగా విసిరేసిన పేపరయినా లోపలికి తెచ్చుకోవాలి. గోడపై పాల ప్యాకెట్ ఏదయినా ఉందేమో చూసుకోవాలి. కానీ శరీరం సహకరించడంలేదు. శరీరం బరువుగా ఉంది. శత్రువులాక్రమించిన కోటలా ఉంది. గునపాలతో తవ్వుతున్నట్టుగా నొప్పి.

పరబ్రహ్మంగారు వస్తారు. ఆయన రాసిన కొత్త కథను చదివి వినిపిస్తానన్నారు. ఆయనకు పావుగంటకో టీ కావాలి. 'ఆంధ్రజ్యోతి' వాళ్లకో కథ రాయాలి. పౌరహక్కుల సంఘపు రత్నకుమార్ వస్తాడు. కలిచేడు దళితులపై జరిగిన దాడిపై రిపోర్టు తయారుచేయాలి.

ఈ పనులన్నిటినీ వాయిదా వేసుకుని ఇలాగే పడుకోవాలని ఉంది. కానీ ఈ పడుకోవడంలోనూ ఏం సుఖం లేదు. పరుపు దూదితో కాక పల్లేరుకాయలతో కుట్టినట్టుగా ఉంది. 'నాలుగు క్రోసిన్ బిళ్లలూ, పది బాక్ట్రిమ్ బిళ్లలూ తెచ్చి దగ్గర పెట్టుకోవచ్చు కదా! మీ రచయితలంత బద్ధకస్తులు ఉండరు' అంటుంది సరళ. బద్ధకం కాదు. నా శరీరంపై పెట్టుకున్న నమ్మకం. దానికే రిపేర్లు రావనే అమాయకమైన భరోసా. లేవాలి. లేచి గదయినా ఊడ్చుకోవాలి. ఈ సిగరెట్టు పీకలు, అక్కడో దృశ్యం, ఇక్కడో దృశ్యంగా ఎగిరిపడ్డ (కథా) కాగితాల్ని సర్దాలి. బయట ఉన్న పేపరు తేవాలి. అందులో కథా సదస్సు గురించిన రిపోర్టు ఉందేమో చూడాలి. ఈపాటి రిపోర్టు వెయ్యడానికి మూడు గంటలు తిన్నాడా శ్రీనివాస్. విప్లవ సాహిత్యంలో బ్రాహ్మణవాదం పెరిగిపోతున్నదని, దళిత, మైనారిటీలకు ఇక్కడా కుల వివక్ష తప్పడం లేదని.

జేబులో కాపర్సు ఏమయినా మిగిలి ఉన్నాయేమో చూసుకోవాలి. అప్పుడెప్పుడో రాసిన కథకు నిన్న రెండు వందల మనియార్డర్ వచ్చింది. రెండు వందలు గప్పున ఊదేశారు మిత్రబృందమంతా. పరబ్రహ్మంగారు మొహమాటపడ్డారు కానీ, ఆ ఖలీల్‌గాడు పదపదమంటూ గీతా కేఫ్‌లోకి తోశాడు. నూటయాభై రూపాయలకు బిల్లు. యాభై అయినా మిగిలాయి కదా నెలాఖరు ఖర్చులకు అనుకుంటుండగా, 'ఆకలిగా వుంది. మధ్యాహ్నం కూడా పుడ్డు పడలా!' అంటూ సరళ దిగబడింది. అడిగిందే తడవని ఆ నవయుగాలో చికెన్ బిరియానీ.... 'గొప్ప అనార్కిస్టువు నువ్వు. బ్రాహ్మల పిల్లచేత ఇట్లా మిలటరీ తిండ్లు తినిపిస్తున్నావు!' అంది. కడుపు లోపలి చికెన్ ముక్కకు ప్రాణం వచ్చి ముక్కుతో ప్రేగుల్ని కరుస్తున్నట్టుగా... ఇన్ని ఉద్యమాలు, ఇన్ని అవగాహనల తరువాత కూడా ఈ కులం మురికి వదలదా? ఫ్రాయిడ్ చెప్పిన 'ప్రిమిటివ్ కాన్షస్‌నెస్' లాంటిదేదో ఉండి తీరాలి. నేను బ్రాహ్మల పిల్లని, నా త్యాగం చూడు, నా గొప్పతనం చూడు..... సరళా యూటూ....

దిండుకింద మడిచిపెట్టిన చొక్కా జేబులో అక్షరాలా ఐదు రూపాయిల నలభై పైసలు. ఈ అయిదు రూపాయిల నలభై పైసలు కిరాణా కొట్టువాడి దగ్గరకు చేరేదెలా? అవి రెండు - మూడు టీ పొట్లాలుగా, కాస్తంత పంచదారగా రూపాంతరం చెందేదెలా?

ఊరులో ఏదో గొడవలుగా వున్నట్టున్నాయి. పొద్దునే పోలీసువ్యాన్ ఒకటి గుంపులు గుంపులుగా తిరగొద్దని, 144వ సెక్షన్ అమల్లో వుందని అరుచుకుంటూ వెళ్లింది. ఊళ్లోనే కాదు నా శరీరంలో కూడా నిషేధాజ్ఞలే. నాది నూటమూడు డిగ్రీల సెక్షన్. అడుగు కూడా కదపలేని స్థితి.

'హింసరచన' అని ఓ కొత్త కథ రాశానయ్యా. హింసంటే కత్తులతో పొడుచుకోవడం, బాంబులు వేసుకోవడం మాత్రమే కాదు. క్రమంగా ఇరుకైపోతున్న సోషల్ వ్యాక్యూమ్ కూడా హింసేనయ్యా. ఒక కాలేజీని కాన్వాస్‌గా తీసుకుని రాశాను. పత్రికకు పంపేముందు నీకు చదివి వినిపిస్తాను. నీ మీద నాకు గురి కుదిరింది. కథా రచనలో నా అంతటివాణ్ణి చేస్తాను....' అంటూ ఆ పరబ్రహ్మాం, ఇవాళ ఉదయం ముహూర్తం నిర్ణయించాడు.

హింసరచన నగరంలో ఏం ఖర్మ! ప్రస్తుతం ఈ గదిలోనూ వుంది. నా శరీరంలో జరుగుతూంది హింసరచనే. వెయిన్స్‌లో రక్తం కాక ఏ సల్ఫ్యూరిక్ ఏసిడో ప్రవహిస్తున్నట్టుగా.... సెగలు, పొగలుగా, ఉష్ణకాసారంలా ఉంది శరీరం. సజీవంగా శిలువపై పడుకోబెట్టి వందలకొద్దీ చీలలు దిగగొడుతున్నట్టుగా వుంది. రాత్రి నిద్రలో ఎప్పుడో ముళ్లపంది ఒకటి శరీరంలో ప్రవేశించి, ఉదయాన్నే ముడుచుకున్న ముళ్లను విప్పినట్టుగా..... ఇదే నిజమైన హింసరచన. పరబ్రహ్మంగారూ, ఈ విషయంపై మరో కథ రాయమనవి!

కిర్ర్..... కిర్ర్.... తెరుచుకుంటోంది తలుపు. ఎవరో పుణ్యాత్ముడు, దయాత్ముడు.... తన బలమైన చేతులతో నన్ను లేవనెత్తేవాడు. అట్లా వంటగది దాకా వెళ్లి ఒక కప్పుడు టీ ఇవ్వగలిగేవాడు. కనీసం ఆ కిటికీ రెక్క తెరిచి, ఈ కాసిని కాగితాలు సర్ది, ఆ సిగరెట్ పీకల్ని ఊడ్చి, నన్ను తరింపజేసేవాడు. అట్లా రోడ్డు దాకా వెళ్లి రెండు క్రోసిన్ మాత్రలు తెచ్చిపెట్టేవాడు... రాడే.... ఎంతకీ రాడే.... తలుపు కిర్రుమంటుందే కానీ మనిషి రాడే...

"సార్! లోపలికి రావచ్చా!" రావచ్చేమిటి రండి! రండి! వచ్చి నన్ను ఉద్ధరించండి!

తెరిచిన తలుపులోంచి, ఒక స్త్రీ, రెండుగా, మూడుగా, పదిగా, వందలు వేలుగా.... ఆప్టికల్ ఇల్యూషన్ కాదు కదా! కాదు కాదు స్త్రీలే. లెక్కపెట్టలేనంతమంది. అయితే వాళ్లను స్త్రీలు అనడానికి చిరుగుల చీరలు తప్ప మరే ఆధారం లేదు. వాళ్లు భూమిని పెళ్లగించుకుని పైకి లేచిన శవాల్లా ఉన్నారు.

"మాది కలిచేడు. మాలపల్లి మాది. రత్నకుమార్ గారిని కలుద్దామని వచ్చాము" అవును తల్లీ.... మిమ్మల్ని నేనెరుగుదును. పేపర్లలో చదివిన అర్థ సత్యాల్లోంచి కాక, రత్నకుమార్ సేకరించిన నిజాల్లోంచి మిమ్మల్ని నేనెరుగుదును. దొంగలంజా కొడుకులసలే మెసలే ధూర్తలోకంలో.... తల్లీ, ఇలా దైన్యంగా కాదు. బిగించిన పిడికిలిలా ఉండాలి.

"రత్నకుమార్ సార్ ఇప్పుడొస్తాడు కదయ్యా!"

వస్తాడమ్మా వస్తాడు. మీ కథలూ, గాథలూ ప్రపంచానికి వినిపించడానికి వాడు వస్తాడు. మీ కన్నీళ్లని అక్షరాల్లోకి అనువదించి జనంలోకి పంచడానికి తప్పక వస్తాడు.

అమ్మా అట్లా కింద కూలబడ్డారే. ఈ జ్వరమే లేకుంటే మీకు కాస్త టీ అయినా ఇద్దునే. మీ దు:ఖాన్ని, విషాదాన్ని నేనూ అనుభవించి పలవరించి ఉందునే.

ఈపాటి జ్వరానికే నా శరీరం వశం తప్పుతోందే? కత్తులు, గొడ్డళ్లతో నరకబడ్డ శరీరాల్తో ఎట్లా నడవగలుగుతున్నారు. నడిచి, కాలాన్ని గడిచి ఎట్లా ఇన్ని పోరాటాలు చేయగలుగుతున్నారు? అమ్మా! నా శరీరాన్ని మొత్తాన్ని చేతులుగా ముకుళించి నమస్కరిస్తున్నాను.

తెరిచిన తలుపులోంచి బయటకు చూస్తే, బయట అసహనంగా చిట్లించిన నొసలులా ఆకాశం. ఫెడేల్మని ముఖం మీద తగిలే ఎండ. ఆకులలో అలజడి లేదు. గాలికోసం తపస్సు చేస్తున్నాయి చెట్లు.

జ్వరంతోపాటు భరింపలేని చలి కూడా నా శరీరంపై దాడి చెయ్యడం మొదలుపెట్టింది. కళ్లు బరువుగా, మగతగా.... బొద్దింకలు కనురెప్పల చాటు నుండి ఊరేగింపుగా వెడుతున్నట్టుగా ఉంది. శరీరమంతా వణుకు. గది, మంచం, బెడ్‌తో సహా నన్ను మంచు కప్పిన అరణ్యాల్లోకి విసిరి వేసినట్టుగా, మంచు పాములు నాలుకల్తో నా శరీరాన్ని నాకుతున్నట్టు.... ఈ అరణ్యాలకు నిప్పు పెట్టండి. నా శరీరానికి వేడి నివ్వండి.

"ఒళ్లు బాగా లేదా నాయనా!" కలిచేడు ఆడవాళ్లు. మొండాలుగా, శిరస్సులుగా, కాళ్లుగా, చేతులుగా నరకబడ్డవాళ్లు!

వెచ్చగా ఏదో నాపైన పాకుతున్నట్టుగా.... బహుశా దుప్పటి కప్పి ఉంటారు. ఎంత హాయి. కాళ్లు డొక్కలోకి ముడుచుకుని.... ఫీటస్‌లాగా మళ్లీ అమ్మలోకి ప్రయాణిస్తూ....

"అయ్యా, రత్నకుమార్ సారుకు చెప్పయ్యా! పల్లెలో జనమంతా వచ్చామని. చావో బతుకో ఇక్కడే తేల్చుకుంటామని. ఇంతవరకు ఒక్క నా బట్టని అరెస్టు చెయ్యలేదు. పొలాలిస్తాం, లోన్లు ఇస్తాం, ఇళ్లు కట్టిస్తాం అంటారే గాని వాళ్లను అరెస్టు మాత్రం చెయ్యరు. వాళ్లని అరెస్టు చేసేదాకా కలెక్టరాఫీసులోనే పడుంటాము. అయ్యా! మాకెవురూ లేరయ్యా! మీలాంటి బిడ్డల్ని నమ్ముకుని వచ్చామయ్యా! అయ్యా! మారాజా.....!" అంటూ పొగిలిపొగిలి ఏడుస్తున్నారు వాళ్లు.

అమ్మా.... మీరు ఏడవద్దు.... మా శరీరాల్ని కత్తులుగా మార్చుకుని మీ చేతుల్లో ఆయుధాలై ఇముడుతాము. మమ్మల్ని మేము మంటలుగా మార్చుకుని అశ్శరభ, అశ్శరభ అనుకుంటూ మీ వెంట వస్తాము.

వాళ్లు గదిలోంచి ఫేడౌట్ అవుతుండగా పరబ్రహ్మంగారు వచ్చారు. ఆయన్ను అనుసరించి ఖలీల్, రమణ, మోహన్‌రెడ్డి, దయానిధి..... తెలుగు కథను సుసంపన్నం చేస్తున్న కథా ప్రముఖులు కూడా వచ్చారు.

"ఏమిటోయి ఇంకా పడుకునే ఉన్నావు. కర్ఫ్యూలు, నిషేధాజ్ఞలు దాటుకుని నీకోసం వస్తే.... నువ్విలా బద్ధకంగా.... కొంపదీసి జ్వరం ఏదన్నా...."

"అవును సార్.... జ్వరతీరంలో, మంచు అరణ్యంలో, కొండచిలువ నోట్లో...."

"జ్వరంలోనూ కవిత్వమా! చింత చచ్చినా పులుపు చావకపోవడం ఇదేనేమో! సరే నువ్వు కాస్త రెస్ట్ తీసుకో. మనవాళ్ళు కథ కథ అని గొడవ చేస్తున్నారు. అది చదివి వినిపిస్తే ఒక పని అయిపోతుంది. ఆ తరువాత మనం కబుర్లు చెప్పుకుందాం"

పరబ్రహ్మంగారు 'హింసరచన' కథ చదవడం మొదలుపెట్టారు. "ఇంకా పదమూడు రోజులే. కాలేజీలో అడుగుపెడుతూ స్వగతంలా గొణుక్కున్నాడు రాఘవరావు. కాలేజీలో రోజూ కనిపించే ఉల్లాసం చైతన్యం కనబడడంలేదు. అప్రకటితమైన ఎమర్జెన్సీ అమలులో వున్న ప్రాంతంలా ఉంది కాలేజీ. ఎవరి ముఖంలోనూ ఉత్సాహం, జీవం కనబడడంలేదు"

"ఇట్లా మొదలౌతుంది కథ. దీన్ని ఎత్తుగడ అంటాము. ఒక మూడ్‌ని వాతావరణాన్ని సృష్టించి పాఠకుణ్ణి మెల్లగా మనవెంట తీసుకెళ్తాం"

మధ్యమధ్య వ్యాఖ్యానాలతో సహా పరబ్రహ్మంగారి కథా ధార కొనసాగుతూ వుంది. ఆయనది గొప్ప కథా కథనశైలి. ఇంత జ్వరంలోనూ, ఇంత శారీరక హింసలో సైతం ఆయన కథలోని దృశ్యాలు మనసులో బొమ్మ కడుతున్నాయి. పరీక్ష హాల్లో ప్రశ్నాపత్రాల్ని తగలబెట్టి పెద్దగా అరుచుకుంటూ రావడం - ప్రిన్స్‌పాల్‌ని ఘెరావ్ చెయ్యడం - పోలీసుల ప్రవేశం - లాఠీఛార్జి - పొదల్లో తుప్పల్లో ప్రాణభీతితో పరుగెత్తడం - రాఘవరావు ఫ్లాష్‌బ్యాక్ - తన కులం గురించి రాఘవరావులో ఆత్మన్యూనత - అభద్రతాభావం - పరీక్షలు తప్పడం - ప్రేమలో పరాజయం - దేనిపైనో, ఎవరిపైనో స్పష్టంగా తెలియని కసి, ద్వేషం - మరుసటి రోజు కాలేజీ ముందు పిల్లల నిరాహార దీక్ష - విద్యార్థుల్ని ప్రిన్స్‌పాల్ అనునయించడం - ప్రిన్సిపాల్ రాఘవరావు దగ్గరకు రావడం - దగ్గరకు రాగానే బొడ్డులో రహస్యంగా దాచుకున్న కత్తితో ఆయన్ను పొడవడం - పొడిచి, అలాగే నేలపై కూలబడి, రెండు చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవడం -

తుఫాను వేగంతో ఆయన కథ మనసును తాకింది. చిత్రమైన అలజడి 'హింసను మనమెప్పుడూ ప్రతిఘటిస్తూనే ఉంటాము, నిరసిస్తూనే ఉంటాము' పరబ్రహ్మంగారు తన కథలోని అంత: సూత్రాన్ని, సందేశాన్ని వివరిస్తున్నారు.

తలుపు దగ్గర శబ్దం..... టక్..... టక్..... శబ్దం. ఆ అడుగుల చప్పుడు నాకు పరిచయమైందే. సరళ వచ్చినట్టుంది.

రా! సరళా రా! జ్వరసముద్రంలో ఊపిరాడక చచ్చిపోతున్న నన్ను పైకి లాగు.

"ఏమైంది చంద్రానికి, అయ్యో శరీరమంతా కాలిపోతోందే...." ధర్మామీటరు తెచ్చి నోట్లో పెట్టింది. చల్లటి గుడ్డ ఒకటి నుదుటిపై వేసింది. పక్కనే కూర్చుని ప్రేమగా జుట్టు నిమురుతూ...... ఆ స్పర్శలో ఎప్పటివో జ్ఞాపకాలు. పాలపీకా, ఉగ్గిన్నెడు ఆముదం, ఉడకబెట్టిన కారెట్ ముక్కలు, చుక్కల మందు, ఒంటిపై సుగంధాలు విరజిమ్మే టాల్కం పౌడరు, లైఫ్‌బాయ్ నురుగు, చలువ చేసిన నిక్కరు వాసన, సిరాపెన్ను, పుస్తకాలు, అన్నం బాక్స్ సర్దిన సంచి, అందించే అమ్మ చేతులు, ఆ చేతులకు పూసిన పరిమళాలు- అవన్నీ గుర్తుకొస్తున్నాయి.

"పరబ్రహ్మంగారూ మీరు వచ్చి ఎంతసేపయింది?"

" ఓ రెండు గంటలయి ఉంటుందమ్మాయి! వచ్చినప్పటి నుంచీ ఈ కథా చర్చలోనే ఉన్నాము. కథలోని సందేశము పాఠకుడికి ఎఫెక్టివ్‌గా చేరుతుందా లేదా అని చర్చిస్తున్నాం"

"మీ ఎదురుగా ఒక వ్యక్తి జ్వరంతో విలవిలలాడుతుంటే పిసరంత జాలైనా కలగలేదే మీకు. అట్లా బజారుకెళ్లి ఒక జ్వరం బిళ్ల తెచ్చి వేద్దామన్న ఆలోచనే ఎవరికీ రాలేదే...."

"ఇదుగో ఈ కథ హడావుడిలో పడిపోయాం. అదీగాక ఊరంతా గొడవలు. ఆ కలిచేడు దళితులు కాబోలు కలెక్టరేట్‌పై దొమ్మీ చేశారట. నిషేధాజ్ఞలు, కర్ఫ్యూలు. ఈ కర్ఫ్యూల్లో వెళ్లిమందులు తేవడం అయ్యేపనేనా?" పరబ్రహ్మంగారు విసుగ్గా అన్నారు.

"జ్వరంతో కొట్టుకులాడే మిత్రుడి కోసం కొద్దిపాటి సాహసం కూడా చేయలేని మీరు, మీ కథల్లో మాత్రం సామాజిక ప్రయోజనం అని తెగ వాపోతుంటారు. ప్రపంచాన్ని మభ్యపెట్టే మోసగాళ్లు మీరు. మీరూ, మీ కథలూ, మీ అనుచరగ్రహాలూ మొత్తం కట్టగట్టుకొని తగలబడండి!' ' అంటూ నిర్మానుష్యమైన వీథుల్లోకి హడావుడిగా వెళ్లింది మందులు తేను.

పరబ్రహ్మంగారు రౌద్రమూర్తి అయ్యారు. కోపంతో ముక్కుపుటాలు అదురుతున్నాయి. అనుచరులకు కూడా ఇది ఊహించని షాక్.

"చూశారా ఎంత పొగరో?"

"మరే ఫెమినిస్టులు కదా! కుటుంబాలు, మొగుళ్లూ వద్దని తిరిగేవాళ్లకు మర్యాద, మప్పితాలేం తెలుస్తాయి?"

"ఆ రత్నకుమార్, ఈవిడా కలిసి సహజీవనమట. అది పెళ్లి కాదట. కలిసి వుండటము అట.... మధ్యలో చంద్రం ఒక ఉప కథానాయకుడు...."

పరబ్రహ్మం! పరబ్రహ్మం! ఒరేయ్ పరబ్రహ్మం! తెలుగు కథకు పెద్దదిక్కయిన పరబ్రహ్మం! అక్షరాల మధ్య చుట్టలు చుట్టుకున్న పాములాంటి పరబ్రహ్మం! అయ్యో! నిన్నా ఇంతగా గౌరవించాను!

* * *

సగం మేలుకొని, సగం నిద్రిస్తూ, చుట్టూ ఉన్న పరిసరాలు వస్తువులు సగం సగం అర్థం అవు తుండగా మెల్లగా కళ్లు విప్పాను. సూర్యతాపం తగ్గుముఖం పట్టి గది చుట్టూ చల్ల చల్లటి నీడలు పారాడుతున్నాయి. జ్వరం తగ్గి ఒళ్లంతా చెమటలు పడుతున్నాయి. ఇప్పటివరకూ హింసరచన చేసిన పరబ్రహ్మం అండ్ కో గది నుండి నిష్క్రమించినట్టున్నారు. సరళ కవితా సంపుటి నొకదాన్ని చదువుకుంటూ కూర్చుంది.

గది అంతా శుభ్రంగా ఊడ్చి ఉంది. పుస్తకాలు, అరలు, ఫ్లవర్‌వేజ్ తాజాగా అప్పుడే స్నానం చేసి వచ్చినట్టుగా ఉన్నాయి. ఫ్లవర్‌వేజ్‌లోని ఎర్రగులాబీ ఒకటి శుభాకాంక్షలు చెబుతు న్నట్టుగా ఉంది.

"ఎట్లా ఉంది? ఒక కప్పు కాఫీ ఇవ్వనా? బ్రెడ్ టోస్ట్ కూడా ఒకటి చేసి పెట్టాను"

నాకెందుకో దు:ఖం వచ్చింది. ఆ అమ్మాయి వయసులో నాకంటే చిన్నది. అయినా తన చేతుల్ని దగ్గరకు తీసుకుని అందులో ముఖం దాచుకుని హాయిగా ఏడవాలనిపించింది. ఈ పోరాటాలు, పోట్లాటలు, వివాదాలు, కరపత్రాలు వీటి మధ్య ఎంత చల్లని ఓదార్పు.

కాఫీ తాగుతుండగా రత్నకుమార్ వచ్చాడు. మనిషి ఎందుకో విసుగ్గా కోపంగా వున్నాడు. ముఖం, ఎర్రగా, ఉగ్రంగా ఉంది.

"ఆ లంజాకొడుకులు.... ఆడవాళ్లు అని కూడా చూడకుండా లాఠీఛార్జీ చేయించారు. వాడెవడో సోషల్ వెల్ఫేరు మంత్రట. వాణ్ణి చూడాలని, వాళ్ళ గోడు చెప్పుకోవాలని లోపలికి తోసుకువెళ్లారు. కసిగా, ఎవరో శత్రుసైన్యంపై విరుచుకుపడ్డట్టుగా వాళ్లపై పడ్డారు పోలీసులు. రక్తసిక్తమైన రోడ్లమీద అట్లా శవాల్లా పడి ఉన్న వాళ్లను చూస్తే ఏడుపొస్తోందిరా! పౌరహక్కులు వల్లకాడు.... అంతా బోగస్!"

రత్నకుమార్‌కి టీ ఇస్తూ, "అట్లా నీరసపడిపోతే ఉద్యమాల్నేం నడుపుతాం! ఈ పరిస్థితులింతే, ఈ మనుషులింతే అని నిర్ణయించుకుని, మనం కూడా మన ఉద్యమాల్ని ఇంకా తీవ్రతరం చెయ్యాలి" సరళ ఆరిందాలా ఓదార్చుతోంది. "పద, ఆ కలిచేడు ఆడవాళ్ల దగ్గరికే పోదాం, మన అవసరం ఏదైనా వుంటుందేమో?" అంటూ రత్నకుమార్‌ని బయల్దేరదీసింది. నావైపు తిరిగి "దిండు కింద మాత్రలు వున్నాయి. ఆరుగంటలకు మరో రెండు మాత్రలు వేసుకో!" అంది.

వాళ్లవైపు విస్మయంగా, ఆరాధనగా చూస్తూ పక్కనే వున్న తెల్లకాగితాల్ని, కలాన్ని తీసుకున్నాను. "జ్వరతీరాన" మసలిన ఈ కాసిన్ని క్షణాల్ని కథగా రికార్డు చెయ్యడం మొదలుపెట్టాను.

*ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక*